స్టాంప్ పేపర్ల బ్లాక్‌దందా

చిక్కడపల్లి ఎస్ఆర్ఓలో ప్రజలకు ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయం


చిక్కడపల్లిలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కనే ఏజెంట్ల అడ్డాలు

అదీ రోజుకు 1 నుంచి 3 స్టాంప్‌పేపర్లు మాత్రమే
ఏజెంట్లు, బ్రోకర్లకైతే బల్క్‌లో విక్రయం
కృత్రిమ కొరత వల్ల జనాన్ని దోచుకుంటున్న ఏజెంట్లు, బ్రోకర్లు


చిక్కడపల్లిలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున గల చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఎస్ఆర్ఓ) లో స్టాంప్ పేపర్ల కొరత నెలకొంది. దీనిని అదనుగా చేసుకుని ఆఫీసు పరిసర ప్రాంతాల్లో కొంత మంది ఏజెంట్లు, బ్రోకర్లు స్టాంప్ పేపర్లను డబుల్ రేట్లకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారుల అండదండలతోనే ఏజెంట్లు ఈ దందాకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ప్రభుత్వం కొంత కాలంగా 10 రూపాయల స్టాంప్ పేపర్లను నిలిపివేయడంతో రూ. 20, రూ. 50, రూ. 100 స్టాంప్ పేపర్ల విక్రయాలు మాత్రమే జరుగుతున్నాయి. ప్రజలు వీటిని రెంటల్ అగ్రిమెంట్లు, ఇల్లు, ప్లాట్ల కొనుగోలు, వివిధ సంస్థల రిజిస్ట్రేషన్ల కోసం వినియోగిస్తుంటారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..

స్టాంప్ (బాండ్) పేపర్లు కావాలని చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఒక్కొక్కరికి రోజుకు ఒకటి లేదా మూడు పేపర్లు మాత్రమే ఇస్తామని, అంతకంటే ఎక్కువ ఇవ్వలేమని సిబ్బంది చెప్తున్నారు. దీంతో చాలా మంది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టుపక్కల గల ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు.

అధిక రేట్లకు విక్రయిస్తున్న ఏజెంట్లు, బ్రోకర్లు

ఏజెంట్లు, బ్రోకర్లు దీనిని అవకాశంగా తీసుకుని రూ. 20 స్టాంప్ పేపర్‌ను రూ. 40 నుంచి రూ. 50 వరకు, రూ. 50 స్టాంప్ పేపర్‌ను రూ. 70 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నారు. ఇక రూ. 100 పేపర్ అయితే డిమాండ్‌ను బట్టి రూ. 130 నుంచి 150కు, ఒక్కోసారి రూ. 200 వరకు విక్రయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గత్యంతరం లేక ప్రజలు ఏజెంట్ల వద్దే బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తమ దృష్టికి రాలేదంటున్న అధికారులు..

అసలు ధర కంటే రెండు, మూడు రెట్ల ఎక్కువకు ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నిస్తే తాము బల్క్‌లో స్టాంప్ పేపర్లను కొనుగోలు చేస్తామని, అందువల్ల అధికారులు, సిబ్బందికి కొంత మొత్తం ఇచ్చుకోవాల్సి ఉంటుందని, అందుకే రేట్లు పెంచుకుని అమ్మాల్సి వస్తోందని ఏజెంట్లు బహిరంగంగా చెప్తున్నారు. ఈ స్టాంప్ పేపర్ల బ్లాక్ దందాపై సంబంధిత అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అలాంటిది తమ దృష్టికి రాలేదని సమాధానం చెప్పి దాటవేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రేషన్ వద్ద నెలకొన్న స్టాంప్ పేపర్ల బ్లాక్ దందాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


భద్రావతి కల్యాణంలో పాల్గొన్న కందగాట్ల స్వామి తదితరులు

వైభవంగా భద్రావతి కల్యాణం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీ వీవర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం భద్రావతి భావనాఋషిల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కందగాట్ల స్వామి ఆధ్వర్యంలో పద్మశాలీ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు సంప్రదాయ వస్త్రాలతో పాల్గొన్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. మహిళలు కోలాటం, భజనలతో భద్రావతి భావనాఋషిలను ఊరేగించారు. కార్యక్రమంలో పద్మశాలీ ప్రతినిధులు జానయ్య, పాండురంగం, గుర్రం శ్రావణ్, వనం దుష్యంతల, జి.రూప, పి.శారద, దేవేందర్, కె.రేఖాప్రభాకర్, బొమ్మ నరేందర్ పాల్గొన్నారు.

'రూ.5 లక్షల ప్రమాద బీమాను రెన్యూవల్ చేయించాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కార్మిక శాఖలోని లేబర్ ఇన్సూరెన్స్ పాలసీలను ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న లేబర్ అధికారులు ఆ సంస్థలతో కుమ్మక్కై అర్హులైన కార్మికులకు అన్యాయం చేస్తున్నారని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ నేతలు ఆరోపించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు వేముల మారయ్య, మహేష్ దేశపాక్, నిరంజన్ తదితరులు మాట్లాడుతూ, రూ. 5 లక్షల ప్రమాద బీమా గడువు 2024 అక్టోబర్‌లో పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఆటో మోటార్ రవాణా కార్మికులు, హోంగార్డులు తదితర బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బైస దేవదాసు తదితరులు

విచిత్రాలు పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్టూనిస్ట్, రచయిత గట్టుపల్లి సీతారామారావు రచించిన విచిత్రాలు పుస్తకావిష్కరణ సభ మంగళవారం త్యాగరాయగాన సభలో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన సీనియర్ పత్రికా రచయిత బైస దేవదాసు మాట్లాడుతూ, ఒకప్పుడు కథలు, కవితలు బాగా రాసేవారని ఇప్పుడు కవిత్వం విరివిగా రాసేవారి వల్ల తెలుగు కవిత్వం వాసి పెరిగిందని, ఇది మరింత పెరిగితే తెలుగు కవిత్వం విశ్వజనీనం అవుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, రచయిత, నిర్వాహకులు రఘుశ్రీ, సాహితీవేత్తలు సాధన నరసింహాచార్య, డాక్టర్ లలితవాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నోటీసులు ఎలా జారీ చేస్తారు?

● ఎమ్మార్వోను ప్రశ్నించిన బీజేపీ నేత వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్ బస్తీలోని ఇళ్లకు ముషీరాబాద్ తహసీల్దార్ మండల కార్యాలయం సిబ్బంది నోటీసులు జారీ చేయడంతో ఆందోళన చెందిన బస్తీవాసులు తమకు న్యాయం చేయాలని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌ను ఆశ్రయించారు. కార్పొరేటర్ సూచనల మేరకు మంగళవారం బస్తీవాసులతో కలిసి బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌ను కలిశారు. అన్నానగర్ బస్తీలో పేదలు నివసిస్తున్న స్థలం అర్బన్‌లాండ్ పరిధిలో ఉందని, అధికారులు గతంలో డబుల్‌బెడ్‌రూమ్‌లు కూడా మంజూరు చేశారని, అలాంటి స్థలంలో నివసిస్తున్న పేదలకు నోటీసులు ఎలా జారీ చేశారని ప్రశ్నించారు. బస్తీవాసులు అక్కడి స్థిరనివాసం ఉండేందుకు అర్హులని వినయ్‌కుమార్ ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వివరించారు. బస్తీవాసులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బస్తీవాసులు గిరి, సురేష్, యేసు, అజ్మత్, రాజ్‌కుమార్, సంధ్యారాణి, పూర్ణ, సుచిత్ర, వీరమణి, శివరాజు, బీజేపీ నేతలు సాయికుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానపు రోడ్లను ఆధునికీకరించాలి: బీఆర్ఎస్

ముషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లను ఆధునికీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ అన్నారు మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, గంగపుత్ర కాలనీల్లో ధ్వంసమైన రోడ్లపై బీటీ ప్యాచ్‌వర్క్ పనులను జీహెచ్ఎంసీ సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా గోరక్‌నాథ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాలతో రోడ్ల సమస్యలపై పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి రోడ్లకు ప్యాచ్ వర్క్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన నివేదిక తప్పుల తడక: టీడీపీ

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన నివేదిక తప్పుల తడక అని, కావాలనే బీసీ జనాభాను తగ్గించి చూపించారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ సమగ్ర సర్వేలో బీసీ జనాభా 61 శాతం ఉన్నట్లు తేలిందని, కాంగ్రెస్ ప్రభుత్వం 5 శాతం పైగా తగ్గించి బీసీల రిజర్వేషన్లను తగ్గించే కుట్ర చేసిందని ఆరోపించారు. బీసీ కులగణన సర్వేలో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వీధి దీపాల ఏర్పాటు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్, మోతీమార్కెట్, సునార్‌గల్లీ, నింబోలిఅడ్డా, లాల్‌బంగ్లా, బర్కత్‌పుర, విక్రమ్‌నగర్ తదితర ప్రాంతాలలో 40 నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌తో మాట్లాడి ఈ వీధి దీపాలను ఏర్పాటు చేశామని, మిగతా ప్రాంతాల్లోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బల్వీర్, ఎ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ సర్వీసు రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

● బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట జాతీయ రహదారిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణం చేస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి కావస్తూ ప్రారంభానికి సిద్ధమవుతోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లకు పైగా ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారన్నారు. ఇన్నేళ్లకైనా ఫ్లైఓవర్ నిర్మాణం పనులు పూర్తయి ప్రారంభానికి సన్నద్ధం కానుండడంతో ప్రజలలో సంతోషం వ్యక్తమవుతుందని, కానీ సర్వీసు రోడ్ల నిర్మాణం పనులు పూర్తికాక పోవడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వీసు రోడ్ల నిర్మాణం పనులను కూడా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా సుదర్శన హోమం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వైభవంగా మహా సుదర్శన హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుసహస్రపారాయణ, సుప్రభాతం, వేదస్వస్తి, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, శేషవాహన సేవ, తీర్థప్రసాదగోష్టి జరిగింది.


మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నవ్యతేజ

ముందే గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించవచ్చు

● డాక్టర్ నవ్య తేజ

ముషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ నవ్యతేజ పేర్కొన్నారు. మంగళవారం వరల్డ్ క్యాన్సర్‌డేను పురస్కరించుకొని భోలక్‌పూర్‌లోని ఆమ్‌వీ ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ నవ్యతేజ మాట్లాడుతూ.. 40 సంవత్సరాలు దాటిన మహిళలు తప్పనిసరి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుని క్యాన్సర్ బారినుంచి విముక్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్యంపట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రి ఎండీ సందీప్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఈ నెల 8వ తేదీ వరకు మహిళలకు క్యాన్సర్ ఉచిత కన్సల్టేషన్, బీపీ షుగర్ పరీక్షలతో పాటు 50శాతం రాయితీతో బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ టెస్టులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గాంధీ ఆస్పత్రి డాక్టర్ స్వర్జిత్, డాక్టర్ బ్రాహ్మణిలు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రబోధ్ అధ్యక్షతన క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ కో-ఆర్డినేటర్ కె.నీరజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ అనసూయ, డాక్టర్ శిభారాని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రోయ్యూరు శేషసాయి



రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రోయ్యూరు శేషసాయి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ప్రకటించారు. శేషసాయి 1984 నుంచి పార్టీలో క్రియాశీల నాయకుడుగా పనిచేస్తున్నారు. బీజేవైఎం, బీజేపీలో పలు పదవులను ఆయన నిర్వహించారు. అయోధ్య ఉద్యమంలో రెండుసార్లు పాల్గొని యూపీలోని మీర్జాపూర్‌జైలులో 25 రోజులు జైలు జీవితం గడిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఇందుకు సహకరించిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ గవర్నర్ వి.రామారావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ కౌన్సిల్ మెంబర్‌గా కేసరి నర్సింగ్‌రావుయాదవ్



గోల్నాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్ బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమితులయ్యారు. బీజేపీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా నర్సింగ్‌రావు యాదవ్ పనిచేస్తూ పార్టీలో కిందిస్థాయి నుంచి వివిధ పదవులు నిర్వహిస్తూ పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తూ ముందుకు సాగిన ఆయనను పార్టీ నాయకత్వం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమితులు చేసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనపై నమ్మకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమించడం ఎంతో సంతోషంగా ఉందని, పార్టీ అభ్యున్నతికి మరింత అంకితభావంతో పని చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, నూతన అధ్యక్షుడు లంకెల దీపక్‌రెడ్డి, మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు మూల రవీందర్‌గౌడ్, పార్టీ నేతలకు నర్సింగ్‌రావుయాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్‌లోని వైఎంసీఏ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నాం ఒంటి గంట వరకు లింగంపల్లి, నారాయణగూడ బ్లడ్‌బ్యాంక్, రాఘవేంద్రస్వామి టెంపుల్, నృపతుంగ కాలేజ్, పోలీస్ క్వార్టర్స్ చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

సామాజిక న్యాయంలో తెలంగాణ రోల్‌మాడల్

● ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ

కవాడిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి, యావత్ దేశానికి మార్గదర్శకంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ అన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలో భాగంగా తెలంగాణలో కులగణన పూర్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక న్యాయం అమలు చేయడంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం రోల్ మాడల్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో జెర్రిపోతుల పరశురాం పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

● రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొఫెసర్ టి.వెంకటరామయ్యకు తమ పార్టీ మద్దతు ప్రకటించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు అభ్యర్థులకు టీచర్లు, పట్టభద్రులు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీల జనాభాను తక్కువ చూపించారని, ఈ సర్వే తప్పుల తడక అని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాబుగౌడ్, ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, స్వరూపరాణి, రిజ్వాన్, శ్రీహరి, రాములు తదితరులు పాల్గొన్నారు.


భరత్ గౌడ్‌ను సన్మానించిన బిజ్జి కనకేష్ కుమార్, విశ్వం, రాజశేఖర్ తదితరులు

బీజేపీ నూతన అధ్యక్షుడికి భోలక్‌పూర్ నేతల సన్మానం

ముషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను మంగళవారం భోలక్‌పూర్ బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్ కుమార్, ఆర్ విశ్వం, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ నాయకుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల అయిలన్న మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని కార్మికశాఖ అధికారులను డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే క్లియర్ చేయాలని, పెన్షన్ సౌకర్యం 55 ఏళ్లకే కల్పించాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ. 10 లక్షలు, సహజ మృతికి రూ. 5 లక్షలు, ప్రసూతి, వివాహ కానుకలను లక్షకు పెంచాలన్నారు. ధర్నాలో సంఘం నాయకులు ఎం. యాదగిరి, తాటికొండ మధు, వెంకటయ్య, హరిశ్చంద్ర, నందు, సాయికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డాక్టర్ వెంకటేశ్వర్లును సత్కరించిన జస్టిస్ భవానీప్రసాద్, డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

హరికథను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

● జస్టిస్ భవానీప్రసాద్

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హరికథ కళారూపాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జస్టిస్ భవానీప్రసాద్ అన్నారు. నల్లకుంటలోని శంకరమఠంలో మంగళవారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన హరికథ సప్తాహం కార్యక్రమానికి జస్టిస్ భవానీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిభట్ల నారాయణదాసు హరికథ వారసత్వం కొనసాగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత దాసరి వెంకటరమణ, రమాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగవతార్ డాక్టర్ వెంకటేశ్వర్లును అతిథులు సత్కరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు ఢీకొని డీమార్ట్ సూపర్‌వైజర్ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్‌లో నివాసం ఉంటున్న సుబ్బారాయుడి కుమారుడు డి.మహేష్ (19) డీమార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఫలక్‌నామా రైల్వే స్టేషన్‌లోని రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలులో 13 తులాల బంగారు నగలు చోరీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగులో ఉన్న 13 తులాల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్న సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు బయలుదేరారు. రైలు షాద్‌నగర్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి 13 తులాల నగలతో ఉన్న ఆమె హ్యాండ్ బ్యాగు కనిపించలేదు. దాని కోసం గాలించగా బోగీలోని డస్ట్ బిన్ వద్ద కనిపించింది. అయితే, బ్యాగ్‌లో నగలు లేవు. దొంగలు నగలను తీసుకొని ఖాళీ బ్యాగ్‌ను అక్కడ పడేసి పారిపోయారు. బాధితురాలు సంధ్యారాణి మంగళవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మగ్దూం

● సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి నర్సింహ

కవాడిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి మగ్దూం మొయినుద్దీన్ అని, ఆయన స్ఫూర్తితో ఫాసిజంపై పోరాటం చేయాలని సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు ఇటి నర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం మగ్దూం మొయినుద్దీన్ 117వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇటి నర్సింహ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్ భూస్వామ్య ఆగడాలకు వ్యతిరేకంగా తనదైన శైలిలో రచనలు చేసి ప్రజలను చైతన్యం చేశారని గుర్తుచేశారు. ప్రజా పోరాటాలకు మద్దతుగా తన నాటకాలు, రచనల ద్వారా ప్రజల మద్దతును కూడగట్టారని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు గా విభజించి కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా పని చేస్తున్నదని నర్సింహ విమర్శించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, నా యకులు నళిని, రూప, సలీమ్, ఉమర్ ఖాన్, రాజమౌళి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మగ్దూం మొయినుద్దీన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇటి నర్సింహ, సీపీఐ నేతలు